
సాక్షి ఒడిశా

ఆదివారం । 19 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.22,34,528
బంగారం	5 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
వెండి	236గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ఎయిమ్స్ సమీపంలో రాత్రి ఆహార్ కేంద్రాలు

భువనేశ్వర్ నగరంలో కొత్తగా రెండు రాత్రిపూట ఆహార్ కేంద్రాలు ప్రారంభమయ్యాయి.

- 10లో.



హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు

రాయగడలోని తుంబిగుడలో నివాసముంటున్న బినయ్ పాల్ (23) అనే యువకుడి హత్య కేసుకు సంబంధించి చందిలి పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు.

- 10లో.

చెత్తకు చెల్లుచీటి..!

- ఏర్పాటు కానున్న బయో గ్యాస్ ప్లాంట్లు
- అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం
- భువనేశ్వర్‌లో 4 ఏర్పాటు చేసేందుకు నిర్ణయం



భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని నగరం భువనేశ్వర్‌లో చెత్త సమస్యను పరిష్కరించేందుకు భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) సరికొత్త పంథాతో ముందడుగు వేస్తోంది. నగరంలో 4 బయో మీథేన్ గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ అనుమతి లభించింది. ఈ ఏడాది జనవరి 6న జరిగిన సమావేశంలో గ్యాసు ప్లాంట్ల ఏర్పాటును బీఎంసీ ప్రతిపాదించింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోసం ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో మౌలిక సదుపాయాల సాధికార కమిటీ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని అనుబంధ వర్గాలు తెలిపాయి. ప్రతిపాదన ప్రకారం మురుగు నీటి శుద్ధి కర్మాగారాలు (ఎస్‌టీపీ) బయో మీథేన్ గ్యాసు ఉత్పత్తి చేస్తాయి. తడి వ్యర్థాల నుంచి ఈ గ్యాసు ఉత్పాదన జరుగుతుంది. ఎస్‌టీపీల ప్రాంగణంలో గ్యాస్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు నగర శివార్లలోని స్థలాలను భువనేశ్వర్ నగర పాలక సంస్థ (బీఎంసీ) గుర్తించింది.

నగర శివారులో ప్లాంట్లు

నగర శివారు రోకట్, మెహెర్‌పల్లి, కొచ్చిలాపుట్ మరియు బసుఘైలో ప్లాంట్ల ఏర్పాటుకు బీఎంసీ నిర్ణయించింది. ఒక్కో గ్యాస్ ప్లాంట్‌కు 2 నుంచి రెండున్నర ఎకరాల విస్తీర్ణ స్థలం ప్రభుత్వం కేటాయించింది. ఈ ప్లాంట్ల నుంచి ఉత్పత్తయ్యే బయోగ్యాస్‌ను ఇంధన ఖర్చులను అరికట్టేందుకు బీఎంసీ వాహనాల్లో వినియోగిస్తారు. నగరంలో రోజుకు 700 టన్నుల తడి, పొడి వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నారు. వీటిలో దాదాపు 200 టన్నుల తడి వ్యర్థాల నుంచి బయోమీథేన్ గ్యాస్‌ను ఎస్‌టీపీ ప్లాంట్లలో ఉత్పత్తి చేస్తారు. దీని నుంచి రోజుకు 4 టన్నుల గ్యాస్‌ను ఉత్పత్తి అంచనా వేస్తున్నారు. బయోగ్యాస్ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో ఏర్పాటు చేస్తారు. దీనికోసం భాగస్వామి సంస్థను ఎంపిక చేయడానికి బీఎంసీ టెండర్‌ను ఆహ్వానించింది. ఒక్కో ప్లాంట్‌కు రూ.25.30 కోట్ల వ్యయ అంచనాతో మొత్తం సుమారు రూ.100 కోట్ల వ్యయం వెచ్చించనున్నారు. ఈ నేపథ్యంలో ప్లాంట్ల ఏర్పాటుకు స్థానిక నగర పాలక సంస్థ ఉచితంగా స్థలం కేటాయిస్తుంది. ఇతర బాధ్యతలను ప్రైవేటు సంస్థ చేపట్టాల్సి ఉంటుందని బీఎంసీ వర్గాల సమాచారం. ప్రజల ఇంటి ముంగిట నుంచి పొడి మరియు తడి చెత్తను సేకరిస్తున్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా పోగు చేసి చెత్త సేకరించే వారికి అందజేయడంలో ప్రజలు సహకరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ విజయ్ అమృత కులంగే విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య కార్మికులు సేకరించేందుకు సౌకర్యంగా ఉండేలా పొడి, తడి చెత్తను వేర్వేరు కంటైనర్లలో ఉంచాలని కోరారు.

'దేశ సంస్కృతిని తెలిపేవే స్టాంప్స్'



అల్బమ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

రాయగడ: మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, చరిత్రను తెలిపేవిధంగా స్టాంపులు రూపొందిస్తారని పోస్టుమాస్టర్ జనరల్ రిజు గంగోళి అన్నారు. స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో రాయగడ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో రాయపెక్స్–23 పేరిట పోస్టల్ స్టాంప్ ప్రదర్శన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ స్టాంపునకు ఒక కథ ఉంటుందన్నారు. ఎంతో మంది మహోన్నత వ్యక్తుల జీవిత విశేషాలతో పాటు మనదేశ భాష, సంస్కృతికి అద్దంపట్టే విధంగా స్టాంపులు రూపొందించబడుతున్నాయని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో ఇటువంటి తరహా స్టాంపుల ప్రదర్శన జరగడం ఇదే మొదటిసారని ఆనందం వ్యక్తం చేశారు. స్టాంపుల సేకరణ మంచి అలవాట్లలో ఒకటని అభివర్ణించారు. అయితే ఇటువంటి తరహా అలవాటు అందరికీ ఇష్టం ఉండదని, అందుకు ప్రత్యేక శ్రద్ధ ఎంతో అవసరమని తెలియజేశారు. ఈ స్టాంపుల సేకరణ వలన మానసిక శాంతి, కొత్త ఉత్సాహం వస్తుందనేది నిజమని అభిప్రాయపడ్డారు. జేకే పేపర్ మిల్ ఉపాధ్యక్షుడు వినయ్ ద్వివేది మాట్లాడుతూ ఈ స్టాంపుల ప్రదర్శనలో 1937 సంవత్సరంలో చలామణి అయిన స్టాంపుల సైతం ఉండడం అభినందించదగిన విషయమన్నారు. స్టాంపులను సేకరించిన వారిని మన స్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. రాయగడ డివిజన్ సూపరింటెండెంట్ మీనకేతన్ ప్రధాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోస్టల్ అకౌంట్స్ డైరెక్టర్ రిజువన్ అహ్మద్, జీఎం సందీప్ పాండే, రాయగడ తపాల అదనపు సూపరింటెండెంట్ జవహర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శన ఆదివారం వరకు కొనసాగుతుంది.



స్టాంపుల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

ప్రభుత్వం వెనకడుగు

- గిరిజనేతరులకు భూ బదలాయింపు నిర్ణయం వెనక్కి

భువనేశ్వర్: గిరిజనుల స్థిరాస్తులను గిరిజనేతరులకు బదలాయించేందుకు అనుబంధ చట్టం సవరించాలని మంత్రి మండలి ఇటీవల తీర్మానించింది. అయితే ఈ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత ఎదురవ్వడంతో ప్రభుత్వం వెనకడుగు వేసింది. కలెక్టర్ లేదా సబ్–కలెక్టర్ అనుమతితో గిరిజనులు తమ భూములను గిరిజనేతరులకు బదలాయించేందుకు వీలుగా రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అమలు చేస్తున్న ఒడిశా రెగ్యులేషన్–2ను సవరించాలనే మంత్రి మండలి నిర్ణయం అమలును రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. తదుపరి కార్యాచరణపై ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఈనెల 14న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో గిరిజనుల భూముల బదలాయింపునకు సంబంధించి 1956 రెగ్యులేషన్–2కు ప్రతిపాదించిన సవరణను నిలుపుదల చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ వమంత్రి సుదామ్ మరాండి తన ట్విటర్ (ఎక్స్)లో తెలియజేశారు. నిజానికి ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత రోజునే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. మాఫియాలు, పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్లు అమాయక గిరిజనుల భూములను కొనుగోలు చేసేందుకు మంత్రి మండలి చేసిన కుట్రగా అభివర్ణించాయి. అలాగే వివిధ సంఘాలు వ్యతిరేకత తెలియజేయడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది.

యువకుడు ఆత్మహత్య



యువకుడి మృతదేహం

బరంపురం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని లంజిపల్లి రైల్వే క్రాసింగ్ జామి పడియా దగ్గర రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం ఉదయం లంజిపల్లి రైల్వే క్రాసింగ్ జామి పడియా దగ్గర రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడి మృతదేహాన్ని స్థానికులు చూసి వెంటనే బరంపురం జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. అయితే మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఎంకేసీజీ మెడికల్‌కు తరలించారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మునిగి మహిళ మృతి



గంగి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి గంపకొండ పంచాయతీ ఎర్రకొండ గ్రామంలో శనివారం తెల్లవారుజామున స్నానానికి వెళ్లిన గంగి మధిరి (40) అనే మహిళ కాలుజారి మునిగిపోయింది. ఉదయం చెరువు వద్దకు వెళ్లిన గ్రామస్తులకు మహిళ మృతదేహం కనిపించడంతో కలిమెల పోలీసులకు, అలాగే కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

గుడ్ లక్ టీమిండియా



స్థానిక భేజిపూర్ నీలకంఠ నగర్ 3వ లైన్‌కి చెందిన సైకత శిల్పి సత్యనారాయణ మహారణ ఆదివారం జరగనున్న వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా తన కళా నైపుణ్యంతో మిర్రర్‌పై 2023 వరల్డ్ కప్ యానిమేషన్ ఆర్ట్ వేసి శనివారం ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మన జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆయన నైపుణ్యాన్ని పలువురు ప్రశంసించారు.

– బరంపురం

చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- మంత్రి జగన్నాథ సరక



మాట్లాడుతున్న మంత్రి సరక

రాయగడ : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలని మంత్రి జగన్నాథ సరక సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఈసారి పునరావృతం అవ్వకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పంట చేతికివచ్చి రెండు నెలలు పూర్తవుతున్నా, జిల్లా యంత్రాగం కొనుగోలు ప్రక్రియ చేపట్టకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా పలువురు రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు అందుకు అవసరమైన మండీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా మండీలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం భద్రంగా ఉండేవిధంగా జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

డిసెంబర్ 20 నుంచి ధాన్యం కొనుగోళ్లు

ఈ ఏడాది డిసెంబర్ 20వ తేదీ నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టనుంది. దీనికి సంబంధించి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించిన మీదట ఈ తేదీని ఖరారు చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ అధికారి రాజ్ కిషోర్ పాణిగ్రాహి ప్రకటించారు. రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లాలోని 11 సమితుల్లో 42 మండీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. అయితే రైతుల కోరిక మేరకు అదనంగా మరో రెండు మండీల ఏర్పాటు విషయమై చర్యలు తీసుకుంటామని పాణిగ్రాహి అన్నారు.

9,53,731 క్వింటాళ్ల ధ్యాన్యం సేకరణ లక్ష్యం

ఈ ఏడాది ఖరీఫ్‌లో పండించిన పంటల్లో భాగంగా రైతుల నుంచి 9,53,731 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడమే జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుందని సీఎస్‌వో కిషోర్ తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ప్రకటించారు. కామన్ ధాన్యం క్వింటాల్ ధర రూ.2,185 కాగా, ఏ–గ్రేడ్ ధాన్యం ధర రూ.2,203 లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా కొనుగోలు చేపడతామని వెల్లడించారు. సమావేశంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు, మిల్లర్లు

దాడి కేసులో నిందితుడు అరెస్టు

రాయగడ: జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రం దేవగిరిలోని క్రాంతికారి ఆశ్రమానికి చెందిన స్వామీ స్వరూపానంద గిరిపై దాడి కేసులో నిందితుడిని కల్యాణ సింగుపూర్ పోలీసులు శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. నిందితుడు అదే గ్రామానికి చెందిన రవి బాగ్ (31)గా గుర్తించారు. ఈనెల 14వ తేదీన స్వామీ స్వరూపానందగిరి తమ ఆశ్రమంలోని గోశాలకు అవసరమయ్యే సూచిక బోర్డును తయారు చేయించేందుకు కల్యాణ సింగుపూర్‌లోని వెల్డింగ్ గ్యారేజీకి వెళ్తున్న సందర్భంలో, అక్కడే ఒక ఆకతాయి ఇనుప రాడ్డుతో దాడి చేసిన సంగతి పాఠకులకు విదితమే. ఈ క్రమంలో తీవ్రగాయాలకు గురైన స్వామిని మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు. క్రాంతికారి ఆశ్రమానికి చెందినవారు, స్థానికులు స్వామిపై జరిగిన దాడిని నిరసిస్తూ నిందితుడిని అరెస్టు చేయాలని శుక్రవారం కల్యాణ సింగుపూర్‌లో పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకొని కోర్టుకు తరలించారు. కాగా తలపై తీవ్రంగా రెండు చోట్ల గాయాలు అవ్వడంతో స్వామికి ఎంఆర్‌ఐ స్కానింగ్ నిర్వహించడం జరిగిందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీచైతన్య రాంజీ శనివారం నిర్వహించిన పత్రిక సమావేశంలో తెలియజేశారు. రోజులు గడిచినా అతని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో ఉన్నత చికిత్స కోసం భువనేశ్వర్ తరలించనున్నట్లు చెప్పారు. ఏది ఏమైనా ఆధ్యాత్మిక వాతావరణంలో గల ఆశ్రమాల్లో ఇటువంటి దాడికి పాల్పడడం విచారకరమన్నారు.



నిందితుడిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు



మాట్లాడుతున్న శ్రీచైతన్య రాంజీ

మాస్టర్ ప్లాన్‌పై క్రిట్ సమావేశం

జయపురం: స్థానిక సద్భావన సభాగృహంలో జయపురం పట్టణ తుది మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు కొరాపుట్ ప్రాంతీయ అభివృద్ధి సంస్థ (కొరాపుట్ రీజనల్ డవలప్‌మెంట్ ట్రస్ట్(క్రిట్)) సమావేశం శుక్రవారం జరిగింది. కొరాపుట్ ప్రాంతీయ అభివృద్ధి సంస్థ కార్యదర్శి నిర్మల కుమార్ దొళాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జయపురం మున్సిపల్ అధ్యక్షుడు నరేంద్ర కుమార్ మహంతి, ఉపాధ్యక్షురాలు బి.సునీత తదితరులు పాల్గొన్నారు. జయపురం మాస్టర్ ప్లాన్ 1985లో మొదటిసారిగా రూపొందించారు. ఆనాటి పరిస్థితుల ఆధారంగా మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. అయితే ప్రస్తుతం జయపురం పట్టణం అనేకవిధాల మార్పులను సంతరించుకుంది. అందువలన పట్టణానికి మాస్టర్ ప్లాన్ అవసరాన్ని గుర్తించి క్రిట్ సంస్థ ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా 2040 నాటికి పట్టణ విస్తరణ, పెరిగే జనాభా అవసరాలు దృష్టిలో పెట్టుకొని చిట్టా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ప్రతిపాదిత ఆ మాస్టర్ ప్లాన్‌లో కొత్తగా వేయాల్సిన రోడ్లు, వివిధ అభివృద్ధి పథకాలను చేర్చారు. ఈ డ్రాఫ్టు ప్లాన్‌పై ప్రజల అభిప్రాయాలను 60 రోజుల్లోగా సేకరించారు. ఆ సమయంలో జయపురం నుంచి 8 మంది కొన్ని అభిప్రాయాలను సమర్పించారని కొరాపుట్ ప్రాంతీయ అభివృద్ధి సంస్థ (క్రిట్) కార్యదర్శి నిర్మల కుమార్ దొలాయి వెల్లడించారు. సమావేశంలో రాజకీయ నాయకులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వ్యవసాయ రంగంలో రాష్ట్రం పురోగతి

- రైతులకు అన్నివిధాలుగా ప్రభుత్వ సాయం
- మంత్రి జగన్నాథ సరక

రాయగడ: వ్యవసాయ రంగంలో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా మత్స్య, పశు సంవర్ధక శాఖలు సంయుక్తంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్స్య, పశు సంపద గణనీయంగా అభివృద్ధి చెందిందన్నారు. ఇదివరకు మనం పొరుగు రాష్ట్రాల నుంచి వీటిని దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, అయితే ప్రభుత్వం తగు రీతిలో రైతులను ప్రోత్సాహించడం, వివిధ సంక్షేమ పథకాల ద్వారా వారిని ఆదుకోవడంతో దశాబ్ద కాలంలో ఎంతో ఉత్పత్తి పెరిగిందని పేర్కొన్నారు. అలాగే మహిళల ఆర్థిక సాధికారితను మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్వయం సహాయక బృందాలు(ఎస్‌హెచ్‌జీ) సత్ఫలితాలు ఇస్తున్నాయని వెల్లడించారు. పుట్ట గొడుగులు, చేపలు, వ్యవసాయ రంగంలో కూడా మహిళలు రాణిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.



ఉత్తమ రైతులను సన్మానిస్తున్న మంత్రి సరక తదితరులు

ముందుచూపే కారణం

అనంతరం రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి మాట్లాడుతూ.. ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలే కారణమన్నారు. మత్స్య సాగు, పశు సంవృద్ధికి సంబంధించి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుండడంతో ఆయా రంగాల్లో ఆసక్తి కనబరుస్తున్నారని పేర్కొన్నారు. నేడు జిల్లాలో ఎంతోమంది రైతులు చేపల చెరువుల ద్వారా ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మిల్లెట్ మిషన్ పథకం ద్వారా చోడి రైతులకు బాసటగా నిలవడంతో రైతులు లాభాలు ఆర్జిస్తున్నారన్నారు.

లాభాల బాటలో పౌల్ట్రీలు

పౌల్ట్రీల నిర్వహణతో ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని, జిల్లాలో ఇప్పటికి సుమారు 300 పౌల్ట్రీఫారాలు ఉన్నాయని, అదనంగా మరో 300 ఫారాలు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయని జిల్లా పశుసంవర్ధక శాఖ ముఖ్య వైద్యాధికారి డాక్టర్ హడిబంధు భొయ్ అన్నారు. అలాగే పాల ఉత్పత్తి కేంద్రాలు మరిన్ని పెరిగాయన్నారు. పశు, మత్స్య వ్యవసాయంలో రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించేందుకు రెండు రోజుల పాటు ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతులను సన్మానించారు. కార్యక్రమంలో వివిధ సమితుల చైర్మన్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ప్రాంతాల రైతులు



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాల్స్

క్లుప్తంగా

గంజాయి వనాలపై దాడులు



గంజాయి వనాల్లో దాడులు నిర్వహిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పంచాయతీ పరిధి టెర్లెండి గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి వనాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న గంజాయి మొక్కలను అధికారులు, సిబ్బంది ధ్వంసం చేశారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో గంజాయి సాగు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అభిరాం బెహర తెలియజేశారు.

నగరంపల్లి యువకుడికి ఇంటర్నేషనల్ అవార్డు



116 ఆర్టికల్స్‌తో అంబేద్కర్ చిత్రం



అవార్డుతో భానుప్రకాశ్

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో నగరంపల్లి గ్రామానికి చెందిన యువకుడు శిష్టు భానుప్రకాశ్ తన ప్రతిభా నైపుణ్యంతో 'ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్' సొంతం చేసుకున్నాడు. భారత రాజ్యాంగంలోని 116 ఆర్టికల్స్‌తో అంబేద్కర్ (బిగ్గెస్ట్ టైపోగ్రాఫీ పోర్ట్రైట్ ఆర్ట్) చిత్రాన్ని గీసినందుకు ఈ అవార్డు దక్కింది. డిప్లమా పూర్తి చేసి పోటీ పరీక్షలు సన్నద్ధమవుతూ చిత్రలేఖనం పట్ల ఆసక్తితో ఈ చిత్రాన్ని గీశారు. గిన్నిస్ రికార్డుతో సమానమైన ఈ అవార్డు దక్కడంతో తల్లిదండ్రులు భాగ్యలత నీలాచలం ఆనందం వ్యక్తం చేశారు. భానుప్రకాశ్‌ను పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, సర్పంచ్ పద్మావతి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, యువకులు శనివారం అభినందించారు.

టైలరింగ్, ట్యాలీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో 30 రోజుల టైలరింగ్, ట్యాలీ (కంప్యూటర్ అకౌంటింగ్) శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా యువకులు అర్హులని పేర్కొన్నారు. డిసెంబర్ 4 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఈలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలు మాత్రమే అర్హులని చెప్పారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 7993340407, 9553410809 సంప్రదించాలని సూచించారు.

'ఉపాధి' లక్ష్యాలు చేరుకోవాల్సిందే

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో అన్ని మండలాల్లోనూ క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించి ఉపాధి వేతనదారులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పని దినాలు కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలోని వెలుగు కార్యాలయం సమావేశ మందిరంలో ఏపీవోలు, ఈసీలు, ఏపీడీలు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు రెండు వేల మంది కూలీలకు ఉపాధి కల్పించాలని ఆదేశాలు జారీ చేసినా ఎటువంటి ప్రగతి కనిపించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి టూర్ డైరీని జిల్లా కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. 100 రోజుల పని దినాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సామాజిక తనిఖీ రికవరీల బాధ్యత ఏపీవోలదేనని, 100 శాతం బకాయి వసూళ్లు ఈ నెలాఖరులోపు జరగాలన్నారు. జిల్లా హార్టికల్చర్ అధికారి ఆర్.జి.వి. ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి పథకంలో పామాయిల్ సాగును ప్రోత్సహించాలన్నారు. నాలుగేళ్ల పాటు మొక్కలు నిర్వహణ వ్యయాన్ని ఉచితంగా అందిస్తారని, ఐదో ఏట పంట దిగుబడి వస్తుందన్నారు. సమావేశంలో విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఏపీడీలు పి.రాధ, మురళీకృష్ణ, శైలజ, హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, డీబీటీ మేనేజర్ విజయవాణి తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ సమీపంలో రాత్రి ఆహార్ కేంద్రాలు



ఆహార్ కేంద్రంలో వడ్డిస్తున్న మేయర్ సులోచన దాస్



రాత్రి ఆహార్ కేంద్రంలో భోజనం చేస్తున్న మేయర్

భువనేశ్వర్: నగరంలో కొత్తగా రెండు రాత్రిపూట ఆహార్ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఎయిమ్స్ సమీపంలో ఈ కేంద్రాలు ప్రారంభించడం విశేషం. రోగులకు మరియు వారి సహాయకులకు రూ.5ల సబ్సిడీ భోజనం రాత్రిపూట ఆహార్ సెంటర్లలో అందుబాటులో ఉంటుంది. భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సులోచన దాస్ సబ్సిడీ భోజన విధానాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో రోజుకు దాదాపు 400 మందికి భోజనాలు సిద్ధం చేయనున్నారు. నగరంలో 3 కేంద్రాలు ప్రధాన ఆస్పత్రులకు సమీపంలో రోజుకు 2 సార్లు భోజనం చౌక ధరకు అందిస్తున్నాయి. వీటిలో ఎయిమ్స్-భువనేశ్వర్ సమీపంలోని రెండు కేంద్రాలు రోజుకు 750 భోజనాలను సిద్ధం చేస్తున్నాయి. ఈ రెండు కేంద్రాల్లో ప్రారంభమైన రాత్రి భోజన వ్యవస్థ రాష్ట్రం లోపల మరియు వెలుపల నుంచి ఆస్పత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులకు ప్రయోజనకరం అవుతాయని మేయర్ తెలిపారు. ఒడిశా ప్రభుత్వం సరసమైన ధరకు అందించే ఆరోగ్యకరమైన ఆహారం పేద రోగులకు మరియు సహాయకులకు చాలా సహాయకారిగా మారిందని వినియోగదారులు తెలిపారు. ప్రస్తుతం భువనేశ్వర్ నగర పాలక సంస్థ బీఎంసీ పరిధిలో మొత్తం 11 ఆహార్ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిలో 3 చోట్ల రాత్రి భోజనం సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఈ ఫుడ్ సెంటర్లలో రోజుకు దాదాపు 9,000 భోజనాలు తయారవుతున్నాయి. కొత్తగా రెండు కేంద్రాల్లో రోజుకు అదనంగా 400 భోజనాలు తయారు కావడంతో రోజువారీ సగటు భోజనాల సంఖ్య 9,400కి చేరుకుంది. త్వరలో ఈ సంఖ్య 10,000కి చేరుకుంటుందని మేయర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ఆరోగ్య కేంద్రం వద్ద సురేష్ చంద్రదొర మృతదేహం



గొవర్ధన్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంభ సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి కుడుములగుమ్మ పంచాయతీ పూజారిగూడ గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. కుడుములగుమ్మ పంచాయతీ గడీపూట్ గ్రామానికి చెందిన సురేష్ చంద్రదొర (28) టాటా పవర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన డ్యూటీ పూర్తయిన తర్వాత శుక్రవారం రాత్రి 8 గంటలు సమయంలో ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. అయితే అదే సమయంలో ఎదురుగా వస్తున్న జక్కన్‌గూడ గ్రామానికి చెందిన గొవర్ధన్ పుజారి(56) బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఈ ఘటన కుడుములగుమ్మ అగ్నిమాపక కార్యాలయం ఎదురుగా జరగడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఇద్దరినీ కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి వారు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అనంతరం ఖోయిర్‌పూట్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

రాయగడ: స్థానిక తుంబిగుడలో నివాసముంటున్న బినయ్ పాల్ (23) అనే యువకుడి హత్య కేసుకు సంబంధించి చందిలి పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఈ కేసులో అరెస్టైన నిందితుల్లో స్థానిక కొల్లిగుడ గ్రామానికి చెందిన గర్నాపు కార్తీక్ (22), తుంభిగుడ గ్రామానికి చెందిన సునేటి పాల్ (23)లు ఉన్నారు. బినయ్ పాల్ అనే యువకుడు తుంబిగుడకు సమీపంలోని ఎంజీ దాబాలో పనిచేసేవాడు. ప్రతిరోజూ మాదిరిగానే దాబాలో పనులు ముగించుకుని ఇంటి వెళ్లాడు. అయితే అర్ధరాత్రి అవుతున్నా బినయ్ ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఈ క్రమంలో స్థానిక సాయిప్రియనగర్ పదో లైన్‌లో బినయ్ రక్తపు ముడుగులో శవమై పడి ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అయితే ఎందుకు హత్య చేశారనే విషయం తెలియాల్సి ఉంది.

విశాఖ-బనారస్ మధ్య రైలు

భువనేశ్వర్: విశాఖపట్నం, బనారస్ మధ్య ప్రత్యక్ష రైలు సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ రైలు సంబల్‌పూర్ మీదుగా రాకపోకలు చేస్తుంది. కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రైల్వేలు, కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్ మరియు సాంకేతిక సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈనెల 20న సంబల్‌పూర్ పర్యటించనున్నారు. దీనిలో భాగంగా ఆరోజు మధ్యాహ్నం సంబల్‌పూర్ రైల్వేస్టేషన్ నుంచి విశాఖపట్నం వరకు వీక్లీ ఎక్స్‌ప్రెస్ సేవలను విస్తరించేందుకు ఇరువురు మంత్రులు జెండా ఊపి ప్రారంభిస్తారు. ప్రారంభ రోజున రైలు సంబల్‌పూర్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తుంది. ఈ రైలు పొడిగించిన భాగంలో రెగ్యులర్ సర్వీస్ విశాఖపట్నంలో ఈనెల 22 నుంచి మరియు బనారస్‌లో నవంబర్ 23 నుంచి ప్రారంభమవుతాయి. ఈ రైలును పొడిగించడం వలన వ్యాపారం, విద్య, వైద్యం కోసం ప్రయాణాలు చేసే ఒడిశా ప్రజలకు ఉపయోగపడుతుంది. సంబల్‌పూర్ మరియు బనారస్ మధ్య ఈ రైలు షెడ్యూల్ సమయాలు మరియు స్టాపేజ్‌లు యథాతథంగా కొనసాగుతాయి.

మృత్యువులోనూ వీడని బంధం



హరి కుల్‌దీప్ దంపతుల అంతిమయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు



ఒకే చితిపై రెండు మృతదేహాలు



హరి కుల్‌దీప్, కమల కుల్‌దీప్ దంపతులు(ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి బలిమెల ఎన్ఏసీ 12వ వార్డులో నివాసముంటున్న హరి కుల్‌దీప్ (55) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. అయితే భర్త మృతదేహంపై పడి ఏడుస్తూ భార్య కమల కుల్‌దీప్ (51) సైతం మృతి చెందింది. దీంతో మృత్యువులోనూ వాళ్ల బంధం విడిపోలేదని స్థానికులు అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హరి కుల్‌దీప్ కుటుంబం కూలి చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే ఆయన కొంతకాలంగా గుండె జబ్బుతో ఇంటి వద్దనే ఉంటున్నారు. వారి నలుగురు పిల్లలు పని చేసుకొని వచ్చి తల్లిదండ్రులను చూసుకుంటున్నారు. కాగా శుక్రవారం ఆయన మృతి చెందగా, గంట వ్యవధిలోనే భార్య సైతం ప్రాణాలు విడిచింది. భర్త మృతదేహంపై పడి ఏడుస్తూ ఆమె స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు లేపినా లేవకపోవడంతో బలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లారు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఇద్దరికీ ఒకే చితిపై దహన సంస్కారాలు నిర్వహించారు.

'కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి'



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: కాశీనగర్, గుసాని సమితులను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు కోరారు. ఈ మేరకు రెండు సమితుల కార్యాలయాల ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. కాశీనగర్ సమితిలోని కిడిగాం, ఖరడ, కాశీనగర్, వల్లాడ, హడ్డుభంగి తదితర ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో పంటలు నాశనమయ్యాయని వెల్లడించారు. వెంటనే సీఎం నవీన్ పట్నాయక్ కరువు ప్రాంతంగా ప్రకటించి, రైతులకు నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాశీనగర్, గుసాని సమితుల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం మంజూరులో వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాబినేట్ మంత్రిగా కార్తికేయన్ పాండియన్‌కు అధికారం ఇచ్చి రాష్ట్రాన్ని తమిళనాడు వ్యక్తికి అప్పజెప్పారని మండిపడ్డారు. అనంతరం కాశీనగర్ బీడీవో కపిలేశ్వర తండికి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో కాశీనగర్ మాజీ చైర్మన్ ఛిత్రి సింహాద్రి, రాష్ట్ర బీజేపీ పరిశీలకుడు సరోజ్ సాబత్, గుసాని సమితి బీజేపీ అధ్యక్షుడు గేదెల శ్రీధర నాయుడు, మాజీ సర్పంచ్ దారపు చిట్టి తదితరులు పాల్గొన్నారు.

జాకబ్ మఝి అరెస్టు



జాకబ్ మఝి(ఫైల్)

పర్లాకిమిడి: గజపతి జిల్లా నువాగడ బ్లాక్ అనుగురు పంచాయతీ మాజీ సర్పంచ్ జాకబ్ మఝిని ఆర్.ఉదయగిరి పోలీసు అధికారి ప్రశాంత మల్లిక్ శనివారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. జాకబ్ మఝి 2017 నుంచి 2022 వరకు అనుగురు పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశాడు. అయితే 2006 మార్చి 24వ తేదీన ఆర్.ఉదయగిరిలో వందమంది నక్సల్స్ స్టేషన్‌పై దాడిచేసి 42 ఖైదీలను విడిపించుకుని వెళ్లిన ఘటనలో జాకబ్ మఝిపై కేసులు వున్నాయి. 2013లో జాకబ్ మఝిని ఒకసారి అరెస్టు చేశారు. అయితే మరికొన్ని కేసులపై శుక్రవారం జాకబ్ మఝి ఆర్.ఉదయగిరి కోర్టుకు హాజరు కావాల్సి ఉంది. కానీ ఆయన కోర్టుకు హాజరవ్వకపోవడంతో ఐఐసీ ప్రశాంత మల్లిక్ తెలియజేశారు.

పేకాట శిబిరంపై దాడి

జలుమూరు: మండలంలోని సుబ్రహ్మణ్యపురం పంచాయతీ, సారవకోట మండలం తొగిరి గ్రామం మధ్య తోటలో శనివారం సాయంత్రం పేకాట ఆడుతూ పట్టుబడిన 15 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.88,146 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పరీక్షల్లో ఫెయిల్.. విద్యార్థిని ఆత్మహత్య



మృతురాలు ఝాన్సీ (ఫైల్ ఫొటో)

శ్రీకాకుళం క్రైమ్: పరీక్షల్లో అన్ని సబ్జెక్టులూ తప్పడంతో మనస్థాపం చెందిన శ్రీకాకుళం నగరంలోని దమ్మలవీధికి చెందిన ఎంబీఏ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. దమ్మలవీధిలో నివాసముంటున్న మండా రమణమ్మకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె పద్మలతకు వివాహమై ఇద్దరు పిల్లలుండగా, చిన్న కుమార్తె ఝాన్సీ (24) ఎచ్చెర్లలోని శివాని కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. పెద్ద కుమార్తె బీసీ హాస్టల్‌లో కుక్‌గా పనిచేస్తూ పిల్లలు, తల్లి రమణమ్మ, చెల్లెలు ఝాన్సీతో కలిసి అందరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శరంగడల్ వీధిలో అయ్యప్పస్వామి భజన వద్దకు తల్లీ, పెద్ద కుమార్తె వెళ్లారు. ఇంతలో ఝాన్సీ తలుపులు వేసుకుంది. పిల్లలు భయపడి పక్కింటి వారి ఫోన్ తీసుకుని తల్లికి విషయం చెప్పారు. వారు వచ్చి చూడగా ఫ్యాన్ హుక్‌కు చున్నీతో ఝాన్సీ వేలాడుతూ కనిపించింది. కిందకి దింపి చూసేసరికి ప్రాణం పోయింది. అక్కడే ఉన్న డ్రెస్సింగ్ టేబుల్‌పై సూసైడ్ నోట్ గుర్తించారు. 'అమ్మా.. ఫస్టియర్ ఫస్ట్ సెమ్‌లో ఫెయిలయ్యాను. ఫ్రెండ్స్ అందరూ పాసయ్యారు. రిజల్ట్ వచ్చి చాలా రోజులైంది. నేను ఫెయిలైనట్లు మీకు తెలిస్తే మిమ్మల్ని ఫేస్ చేయలేను. నామీద చాలా ఆశలు పెట్టుకున్నారు. నాకు భయమేస్తోంది. అందుకే చనిపోతున్నా.. సారీ..' అంటూ ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి ఆరా తీశారు. తమకు ఎవరిపై అనుమానం లేదని, ఎప్పుడూ సరదాగా ఉండే కుమార్తె ఈ ఘాతుకానికి పాల్పడుతుందని అనుకోలేదని తల్లి పోలీసుల వద్ద వాపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ప్రాజెక్టుల ప్రదర్శన.. ప్రతిభకు నిదర్శనం

- ఆలోచింపజేసిన 31వ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలు
- జిల్లా వ్యాప్తంగా 180 ప్రాజెక్టుల ప్రదర్శన
- రాష్ట్ర స్థాయికి ఎంపికైన 7 ప్రాజెక్టులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా విద్యా శాఖాధికారి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు

టెక్కలి: విద్యార్థుల విజ్ఞానం అబ్బురపరిచింది. ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి వైజ్ఞానిక ఆలోచనలు కలిగి ఉండాలని జిల్లా విద్యా శాఖాధికారి వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. టెక్కలిలో శనివారం నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా ప్రాజెక్టుల ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 160 పాఠశాలల నుంచి 180 ప్రాజెక్టుల వివరాలతో విద్యార్థులు హాజరయ్యారు. చివరగా 7 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉప విద్యా శాఖాధికారి కె.అప్పారావు నేతృత్వంలో ఆయన భార్య రామలక్ష్మి జ్ఞాపకార్థం విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి ఉప విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ, జిల్లా సైన్సు అధికారి ఎం.కుమారస్వామి, కె.తిరుమలచైతన్య, నిర్వాహక ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 29, 30 తేదీల్లో విజయవాడలో జరుగుతాయి.



ప్రాజెక్టు పేరు : ఎకో ఫ్రెండ్లీ ఇన్‌స్టాన్స్ స్టిక్స్: (దేవాలయాల్లో వినియోగించిన వ్యర్థాలతో అగరొత్తుల తయారీ ప్రాజెక్టు)
తయారు చేసిన విద్యార్థులు: ఎస్.మాధవిలత, బి.సాయిలక్ష్మి, జె.కావ్య, ఎస్.దర్శిని, జి.మేఘన, బి.తేజేశ్వరి, ఎస్.నవ్య, ఎస్.నవ్య.
గైడ్ టీచర్ : కె.డేనియల్
పాఠశాల పేరు: జెడ్పీహెచ్ఎస్, సింగుపురం.

ప్రాజెక్టు పేరు : న్యూట్రిషన్స్ అండ్ బెనిఫిట్స్ ఆఫ్ బనానా స్టెమ్ (అరటి దవ్వతో పోషకాలు)
తయారుచేసిన విద్యార్థులు: పి.శైలజ, పి.శ్రావణి
గైడ్ టీచర్ : ఎస్.విజయదుర్గ
పాఠశాల పేరు : జెడ్పీహెచ్ఎస్, కోష్ఠ.





ప్రాజెక్టు పేరు: హెల్తీ అండ్ న్యూట్రీషన్ వెల్ బీయింగ్ (సహజ సిద్ధమైన సేద్యం ద్వారా పోషకాల విలువలు)
తయారుచేసిన విద్యార్థులు: టి.చిన్నికృష్ణ, భగవాన్, బి.హేమంత్
గైడ్ టీచర్ : కె.దేవి, బి.పూర్ణిమ.
పాఠశాల పేరు: ఎంజేపీ ఏపీ బీసీడబ్ల్యూఆర్ఎస్, బాయ్స్, కోటబొమ్మాళి.

ప్రాజెక్టు పేరు: ఆర్గానిక్ ఫార్మింగ్ హోలిస్టిక్ అప్రోచ్ (ప్రకృతి ద్వారా లభించే జీవ, వృక్ష సంపద నుంచి ఎరువుల తయారీ)
తయారుచేసిన విద్యార్థులు: ఎ.రోహిత్ శ్రీసాయి, ప్రీతమ్
గైడ్ టీచర్ : బి.అప్పలరాజు.
పాఠశాల పేరు : ఏపీఎంఎస్, పాతపట్నం.





ప్రాజెక్టు పేరు : బయో రెమిడేషన్ ఆఫ్ హెల్దీ మెటల్స్ యూజింగ్ ఈస్ట్ సేప్ ఎకో సిస్టమ్: (ఈస్ట్ కణాలతో నీటిని శుద్ధి చేయడం)
తయారుచేసిన విద్యార్థులు: డి.యుగంధర్, డి.రాకేష్
గైడ్ టీచర్ : జె.షణ్ముఖరావు.
పాఠశాల పేరు : జీహెచ్ఎస్, పలాస.

ప్రాజెక్టు పేరు :
టాప్ సోయిల్ డిగ్రేడేషన్ డ్యూ టు బ్రిక్ ఇండస్ట్రీ రెమిడీస్
(నేల పొరను రక్షించే క్రమంలో ప్లాస్టిక్, ఇసుకతో ఇటుకల తయారీ)
తయారు చేసిన విద్యార్థులు: టి.మౌనిక
గైడ్ టీచర్ : ఎస్.తారకరామారావు.
పాఠశాల పేరు : జీహెచ్ఎస్, పాతపట్నం.





ప్రాజెక్టు పేరు: బయో డీగ్రేడబుల్ శానిటరీ నాప్‌కిన్స్ ఫ్రమ్ కార్న్ హస్క్
(పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కజొన్న తొక్కలతో శానిటరీ నాప్‌కిన్స్ తయారీ)
తయారు చేసిన విద్యార్థులు: ఐ.రోహన్, డి.జస్వర్ధన్
గైడ్ టీచర్ : ఎస్.వీ.ఎస్.ఎల్. పూర్ణిమ.
పాఠశాల పేరు : జెడ్పీహెచ్ఎస్, మురపాక.

క్లుప్తంగా

స్కేటింగ్‌లో రాణించిన హాసిని



స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన హాసిని

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన రోలార్ స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన పొన్నాడ హాసిని పతకాల పంట పండించింది. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన 35వ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో 11-14 సంవత్సరాల వయస్సుగల బాలికల విభాగంలో పాల్గొన్న హాసిని రెండు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం సాధించి వచ్చేనెల చెన్నైలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. అక్టోబర్ నెలలో పూణే జరిగిన 52వ కేంద్రీయ విద్యాలయ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని 1 సిల్వర్ మెడల్, 1 బ్రాంజ్ మెడల్ సాధించింది. ఇప్పటి వరకు 5 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో తలపడిన హాసినిని కోచ్ రాజు, క్రీడాధికారులు అభినందించారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారుల



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు వెళ్తున్న క్రీడాకారులు

విజయనగరం: గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న సబ్‌జూనియర్ క్యాడెట్ రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే 34 మంది క్రీడాకారులు పయనమయ్యారు. వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, కోచ్‌లు యశస్విని, గగన్, చైతన్య అభినందనలు తెలిపారు. విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

క్రీడాకారిణికి నగదు బహుమతి



కలెక్టర్ చేతుల మీదుగా నగదు బహుమతి అందుకుంటున్న క్రీడాకారిణి మౌనిక

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఐదో ప్రపంచకప్ టెన్నీకాయిట్ పోటీల్లో విజేతగా నిలిచిన గరివిడి మండలం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన రెడ్డి మౌనికకు కలెక్టర్ కార్యాలయంలో రూ.25వేల నగదు బహుమతిని కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కోరాడ ప్రభావతి శనివారం అందజేశారు. సౌత్ ఆఫ్రికాలోని విక్టోరియాలో సెప్టెంబర్-30 నుంచి అక్టోబర్-7 వరకు జరిగిన టెన్నికాయిట్ పోటీల్లో సింగిల్స్‌లో మౌనిక స్వర్ణపతకం, డబుల్స్ విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకుంది. విజయాన్ని అభినందిస్తూ ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో టెన్నీకాయిట్ అసోసియేషన్ సభ్యులు కోచ్ ఎం.రామారావు, ఎం.శ్రీనివాసరావు, శివప్రసాద్, గౌరీశంకర్, తిరుపతిరావు పాల్గొన్నారు.

చెరకుతోట దగ్ధం



వెంకటాపురంలో కాలిపోతున్న చెరకు పంట

రేగిడి: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శనివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో చెరకు తోటలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన బొన్న ఆనందరావు చెరకు పొలంపై నుంచి 33కేవీ విద్యుత్‌లైన్ ఉంది. విద్యుత్ వైర్లు తెగి పడడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఆనందరావుకు చెందిన ఎకరా 80 సెంట్లు, కింజరాపు భాస్కరరావుకు చెందిన 60 సెంట్లు విస్తీర్ణంలోని చెరకు పంట కాలి బూడిదైంది. పోలినాటి వెలమ రాష్ట్ర డైరెక్టర్ కింజరాపు సురేష్‌కుమార్ అందించిన సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. ఇద్దరు రైతులకు చెందిన పంట విలువ రూ.5 లక్షలు ఉంటుందని అంచనావేస్తున్నారు. చేతికందిన పంట కాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

సోలార్ పంపు సెట్ చోరీ

భామిని: మండల కేంద్రానికి చెందిన రైతు రఘునాథ్ సాంత్రోకు చెందిన పొలంలోని సోలార్ బోరు మోటారు, బోర్డు చోరీకి గురైంది. భామిని-లివిరి గ్రామాల మధ్యన పొలాల్లో తరచూ బోర్లు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు నిఘావేసి దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.

సమాజ స్థితిగతులు తెలుసుకునేందుకే కులగణన

- జిల్లా స్థాయి సదస్సులో కలెక్టర్ నాగలక్ష్మి
- చరిత్రాత్మక నిర్ణయమన్న వివిధ వర్గాల ప్రతినిధులు





సదస్సుకు హాజరైన వివిధ సంఘాల ప్రతినిధులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: సమాజంలోని వివిధ వర్గాల స్థితిగతులను తెలుసుకునేందుకే ప్రభుత్వం కులగణన చేపడుతోందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కులగణన-2023పై వివిధ కుల సంఘాలు, సంస్థల అభిప్రాయాలను తెలుసుకునేందుకు డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి జిల్లాలో అత్యంత పారదర్శకంగా కులగణన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. దీనిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వారం రోజులపాటు మూడు విధాలైన వివరాల సేకరణకు సర్వే చేస్తారన్నారు. అన్నికుటుంబాల వారు సహకరించాలని సూచించారు. వివరాలను తెలిపిన తరువాత కుటుంబానికి చెందిన ఎవరో ఒక వ్యక్తి వాటిని నిర్ధారిస్తూ బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందని చెప్పారు. సేకరించిన వివరాలు గోప్యంగా భద్రంగా ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

- రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణనకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూనుకోవడం శుభకరమన్నారు. కులగణనతో ఆయా వర్గాల జనాభాను బట్టి సంక్షేమ పథకాల అమలుకు అవకాశం కలుగుతుందన్నారు. కులసంఘాలన్నీ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. సదస్సులో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో ఎస్.డి.అనిత, జిల్లా ముఖ్యప్రణాళికాధికారి జి.బాలాజీ, జిల్లా బీసీ సంక్షేమాధికారి సందీప్‌కుమార్, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి నిర్మలాదేవి, సంక్షేమశాఖ అధికారులు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం

రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న కులగణన ప్రక్రియ చరిత్రాత్మకమైనదని రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.అనూషాపట్నాయక్ తదితరులు కొనియాడారు. ఇప్పటికే వివిధ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఈ సర్వేతో ఆయా వర్గాలకు మరింత ప్రయోజనాన్ని చేకూర్చనున్నారని చెప్పారు. సమావేశంలో వివిధ కార్పొరేషన్ల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు.

అక్కరకు వచ్చిన చట్టం

- పోక్సో కేసుల్లో శిక్షలతో బెంబేలెత్తుతున్న నిందితులు

విజయనగరం క్రైమ్: పోక్సో చట్టంపై ప్రజల్లో అవగాహన పెరిగింది. ఎక్కడైనా ఎప్పుడైనా చిన్నారులపై అఘాయిత్యాలు జరిగితే విద్యార్థులతో పాటు, ప్రజలు నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. విషయం తెలుసుకున్న నిమిషాల వ్యవధిలోనే సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు న్యాయస్థానం కఠిన శిక్షలు వేయడంతో పోక్సో నిందితులు బెంబేలెత్తిపోతున్నారు. 2023 నుంచి ఇప్పటివరకూ 8 కేసుల్లో నిందితులకు పోక్సో ప్రత్యేక న్యాయస్థానం శిక్షలు విధించడం వెనుక పోలీసు అధికారుల దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, సాంకేతిక నైపుణ్యం, విచారణపై ప్రాసిక్యూషన్ ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం, కేసులను నిరంతరం పర్యవేక్షించి, సమీక్షించి, బాధితులకు న్యాయం చేయాలనే సంకల్పం క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. గతంలో పోక్సో కేసులు నమోదైనప్పటికీ న్యాయస్థానాల్లో జాప్యం జరిగేది. కానీ నేడు పోక్సో కేసులను ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు, పోలీసు వాదనలు వినిపించేందుకు ప్రత్యేకంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం జరగడంతో సత్ఫలితాలు వస్తున్నాయి. న్యాయస్థానంలో సాక్షులను సకాలంలో హాజరుపర్చడం, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా సాక్ష్యం చెప్పే విధంగా శ్రద్ధ చూపడం, తీవ్ర నేరాలను ప్రాధాన్య జాబితాలో చేర్చి ప్రాసిక్యూషన్ ప్రగతిని ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షించడం, దర్యాప్తులో సాంకేతిక ఆధారాలను సేకరించి, నేరంలో నిందితుడి పాత్రను న్యాయస్థానంలో శాస్త్రీయంగా నిరూపించగలగడం శిక్షల ఖరారుకు తోడ్పడుతోంది. ఈ ఏడాది 8 పోక్సో కేసుల్లో నిందితులు శిక్షకు గురికాగా, వాటిలోని 5 కేసుల్లో నిందితులు 20 ఏళ్లకు పైబడి జైలు జీవితం అనుభవించే పరిస్థితులు ఏర్పడ్డాయని అధికారులు స్పష్టం చేశారు.

బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం



పోక్సో బాధితులకు సత్వర న్యాయమందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాలతో కొన్ని తీవ్రనేరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, శాస్త్రీయంగా నిరూపించగలగడం వల్ల శిక్షలు ఖరారవుతున్నాయి. గతంలో కంటే పోక్సో కేసుల్లో ప్రాసిక్యూషన్ వేగంగా పూర్తిచేసేందుకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటుచేయడంతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకంతో నిందితులకు శిక్షలు త్వరగా పడుతున్నాయి.

–ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

గుర్తుతెలియని వాహనం ఢీ- ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



యాళ్ల కిరణ్ (ఫైల్)



ప్రమాద స్థలంలో కిరణ్ మృతదేహం

గరుగుబిల్లి: గుర్తుతెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని రావివలసకు చెందిన యాళ్ల కిరణ్ (30) తన స్నేహితుడు గంట నరేష్ కలిసి బైక్‌పై రావివలస నుంచి పార్వతీపురం వెళ్తుండగా, పాలకొండవైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ కిందపడిపోయారు. బైక్ నడుపుతున్న కిరణ్ తలపై నుంచి గుర్తుతెయని వాహనం వెనుక టైర్ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మరణించాడు. వెనుక కూర్చున్న నరేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను చికిత్స కోసం 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. పరిస్థితులు సహకరించక పోవడంతో స్వగ్రామానికి వచ్చి ఆటోను నడుపుతూ జీవనం సాగించాడు. అది కూడా గిట్టుబాటు కాకపోవడంతో ఫైనాన్స్‌కు అప్పగించాడు. బొబ్బిలిలోని జూట్ కంపెనీలో చేరేందుకు వెళ్తుండగా ప్రమాదానికి గురై మృత్యు ఒడికి చేరాడు. తల్లిదండ్రులు అప్పలనాయుడు, రమణమ్మతోపాటు భార్య, పిల్లలు కన్నీ మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తెలిపారు.

వాహనం కోసం గాలింపు

ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు వీరఘట్టం, పాలకొండ పోలీసులకు సమాచారం ఇచ్చామని ఎస్‌ఐ ఎం.రాజేష్ తెలిపారు. వాహనాన్ని అదుపులోకి తీసుకొనేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

మందలించాడని మట్టుబెట్టేశాడు

- హత్యకు గురైన వాచ్‌మన్
- గునపంతో అడ్డగా తలపై మోది, కిరాతకంగా చంపేసిన వైనం
- పోలీసుల అదుపులో నిందితుడు



మృతుడు బంటుపల్లి అప్పలనాయుడు (ఫైల్)

విజయనగరం క్రైమ్: స్క్రాప్ షాపులో ఉన్న వస్తువులను దొంగలించవద్దని మందలించినందుకు వాచ్‌మన్‌ను అతి దారుణంగా చంపేశాడు. మద్యం మత్తులో గునపంతో తలపై మోది, ఛిద్రం చేశాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇండస్ట్రియల్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

వీటీ అగ్రహారానికి చెందిన బంటుపల్లి అప్పలనాయుడు (61) కొన్నేళ్లుగా ఇండస్ట్రియల్ ప్రాంతంలోని ఓ స్క్రాప్ షాపులో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే షాపులో బీహార్ నుంచి వచ్చిన కూలీలు పనిచేస్తున్నారు. వారిలో ఒకడైన మంజి కునాల్ జల్సాలకు డబ్బులు సరిపడకపోవడంతో షాపు నుంచి స్క్రాప్ సామగ్రిని దొంగలించేందుకు ప్రయత్నిస్తుండగా వాచ్‌మన్ అప్పలనాయుడు మందలించాడు. దీంతో కునాల్ వృద్ధుడిపై చేయిచేసుకున్నాడు. అది చూసిన కూలీలు అతనిని నిలువరించారు. చంపేస్తానని బెదిరిస్తూ కునాల్ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. వృద్ధుడి భార్య, కుమారుడు అక్కడకు వచ్చి ఇంటికి వెళ్లిపోదామని చెప్పారు. తగాదా ఏమీ ఉండదనుకుని వృద్ధుడు షాప్ షెట్టర్ తాళం వేసుకుని లోపల మడత మంచంపై పడుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత పూర్తిగా మద్యం సేవించి వచ్చిన కునాల్ గోడదూకి లోపలకు వెళ్లాడు. అక్కడ ఉన్న గునపంతో వాచ్‌మన్‌పై దాడిచేసి తల ఛిద్రమయ్యేలా మోదాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ తర్వాత కునాల్ అక్కడ నుంచి పరారయ్యాడు. శనివారం ఉదయం తోటి వాచ్‌మన్‌లు అప్పలనాయుడుని టీకి పంపించాలని పిలిచారు. ఎంతకీ తలుపు తీయకపోవడంతో సందేహం వచ్చి అందులో ఒకరు గోడదూకి చూసేసరికి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే మృతుడి భార్య యశోద, కుమారుడు తరుణ్‌కు విషయం తెలియజేశారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన కునాల్‌ను రాత్రి తగాదాలో నువ్వే చంపేశావా అని అక్కడ పనిచేసిన కూలీలు ప్రశ్నించడంతో తనకేమీ తెలియదంటూ మెల్లగా జారుకున్నాడు. కొంతసేపటి తర్వాత వాడే హత్యచేసి ఉంటాడని అనుమానం వచ్చిన స్థానికులు అతని గదికి వెళ్లేసరికి అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి ఆధారాలను సేకరించింది. రూరల్ సీఐ టి.వి.తిరుపతి రావు, ఎస్‌ఐ గణేష్ రెండు బృందాలుగా విడిపోయి నిందితుడి కోసం గాలించారు. నిందితుడు విజయనగరం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతుండగా ఎస్‌ఐ బృందం అదుపులోకి తీసుకుంది.





హత్య జరిగిన స్క్రాప్ షాప్ ఇదే..(ఇన్‌సెట్లో) మృతిచెందిన అప్పలనాయుడు

లెండీకి జాతీయ స్థాయి గుర్తింపు



గోవాలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకుంటున్న లెండి ప్రిన్సిపాల్ వి.వి.రామారెడ్డి

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండీ ఇంజినీరింగ్ కళాశాల అఖిలభారత విద్యామండలి ఎడ్యుస్కిల్స్ ఇంటర్న్‌షిప్‌లో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇంజినీరింగ్ విద్యలో ప్రయోగాత్మక విద్యాభ్యాసం, విద్యార్థుల్లో సాంకేతిక నిపుణతను పెంపొందించే దిశగా వివిధ కంపెనీల భాగస్వామ్యంతో ఏటా ఎడ్యుస్కిల్స్ జాతీయస్థాయిలో ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తుంది. 2022-23 విద్యా సంవత్సరానికి మైక్రోచిప్, ఏడబ్ల్యూఎస్, అల్ట్రాక్స్, సెలోనిస్, పాలోఆల్టో కంపెనీలలో నెల్వర్క్, క్లౌడ్‌కంప్యూటింగ్, ప్రాసెస్ మైనింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీలలో 1857 మంది విద్యార్థులు చేసిన ఇంటర్న్‌షిప్‌లకు జాతీయ స్థాయిలో బెస్ట్ పెర్ఫార్మర్ ఇనిస్టిట్యూట్ విభాగంలో లెండి కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచిందని సంస్థ సెక్రెటరీ, కరస్పాండెంట్ కోడూరి శివరామకృష్ణ, ప్లేస్‌మెంట్ డీన్ ప్రకాష్‌బాబు తెలిపారు. గోవాలో జరిగిన కార్యక్రమంలో గోవా సీఎం ప్రమోద్‌సావంత్, అఖిలభారత విద్యామండలి చైర్మన్ టి.జి.సీతారామన్ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు పి.జె.జగన్నాథం పాల్గొన్నారు.

పెన్సిల్ మొనపై క్రికెట్ వరల్డ్ కప్



కొత్తవలస: మండలంలోని దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ జి.ఎం.జి.పరమేశ్వరరావు పెన్సిల్ మొనపై క్రికెట్ వరల్డ్ కప్‌ను చెక్కి అబ్బురపర్చారు. వరల్డ్‌కప్‌ను భారత్ సాధించాలనే సంకల్పంతో మూడు గంటలు శ్రమించి వరల్డ్ కప్‌ను చెక్కినట్టు తెలిపారు. ఆయనను పాఠశాల హెచ్‌ఎం సునీత, ఇతర బోధనా సిబ్బంది అభినందించారు.

బొగ్గు లారీ బోల్తా

రాజాం సిటీ: రాజాంలోని బొబ్బిలి కూడలిలో శనివారం తెల్లవారు జామున బొగ్గులోడుతో వస్తున్న లారీ బోల్తాపడింది. రామభద్రాపురం వైపు నుంచి వస్తున్న లారీ బొబ్బిలి కూడలి నుంచి శ్రీకాకుళం రోడ్డు వైపు తిరిగే క్రమంలో అదుపుతప్పి బోల్తాకొట్టింది. పోలీసులు ఘటనా స్థలంలోని బొగ్గను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయంలేకుండా చేశారు.



రోడ్డుపై అడ్డంగా పడిన బొగ్గులారీ

మహాసభలను విజయవంతం చేయండి

విజయనగరం అర్బన్: విజయవాడలో వచ్చే నెల 5న జరగనున్న ఆర్టీసీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని సంఘ జిల్లా కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. విజయనగరం ఆర్టీసీ డిపో వద్ద ఉన్న సంఘ కార్యాలయం ఎదుట మహాసభల ప్రచార పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జి.నాయుడు, కార్యవర్గ సభ్యులు కె.రవికాంత్, జోనల్ అండ్ డిపో గౌరవాధ్యక్షుడు పి.జి.రాఫిల్, జి.ఎ.రావు, జిల్లా కార్యదర్శి ఎ.రాములు, డిపో సెక్రటరీ జి.పి.రావు, జీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు తొలిప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు తొలి ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు యూనిట్లను ఏర్పాటు చేయడంలో ఉద్యాన, డీఆర్‌డీఏ, బ్యాంకులు కలిసి పనిచేయాలన్నారు. ఈ పథకం కింద 270 యూనిట్లకు ఇప్పటి వరకు 49 ఏర్పాటయ్యాయని, జిల్లాలోని ప్రతి మండలం నుంచి కనీసం పది యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. జిల్లాలో కౌలురైతు గుర్తింపు కార్డు (సీసీఆర్‌సీ)లు కలిగి ఉన్న కౌలు రైతులందరికీ వచ్చే రబీ సీజన్‌లో పంట రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. జిల్లాలో 12,734 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశామని, వీరిలో 1,115 మందికి రూ.3.62 కోట్ల రుణాలు మంజూరు చేశారని, మిగిలిన వారికి రబీలో పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. జగనన్నతోడు పథకం రుణాల మంజూరు ప్రక్రియను 15 రోజుల్లో పూర్తిచేయాలన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడంలో ఉన్న సమస్యల పరిష్కారంపై రిజిస్ట్రేషన్లు, మెప్మా, బ్యాంకు అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ఆర్థిక సహాయం కోసం తల్లులతో కలిసి ఉమ్మడిఖాతాలు తెరిచేందుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు.

- ఎల్‌డీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల మూడో వారంలో ప్రారంభమయ్యే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జనవరి 26వ తేదీ వరకు జిల్లాలో కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూపొందించిన రుణప్రణాళికలో రెండో త్రైమాసికం ముగిసే (సెప్టెంబర్ మాసాంతం) నాటికి 70.05 శాతం లక్ష్యాలను సాధించినట్టు చెప్పారు. వివిధ రంగాలకు రూ.9,064 కోట్ల రుణమంజూరు లక్ష్యం కాగా, రూ.6,349 కోట్లను రుణాల రూపంలో అందజేశామన్నారు. మల్టీ మీడియా ప్రచార రథం తిరిగే గ్రామాల్లో మొబైల్ ఏటీఎం సేవలు అందించే ఏర్పాట్లు చేశామని నాబార్డు డీడీఎం నాగార్జున చెప్పారు. సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీఓ రెహమాన్, యూనియన్ బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ మాధవి, ఏపీజీవీబీ ప్రాంతీయ మేనేజర్ రామకృష్ణ రాజు, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్, వ్యవసాయ శాఖ డీడీ వి.టి.రామారావు, పశుసంవర్థక శాఖ జేడీ విశ్వేశ్వరరావు, సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, గిరిజన సంక్షేమ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పాపారావు, మత్స్య శాఖ డీడీ నిర్మలాకుమారి, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు ఆధునిక సొబగులు

- నాడు-నేడు నిధులతో ఆస్పత్రుల అభివృద్ధి
- 42 పీహెచ్‌సీల ఆధునికీకరణ కోసం రూ.16.04 కోట్ల ఖర్చు
- ఆరు పీహెచ్‌సీలకు కొత్త భవనాలు మంజూరు
- వీటి నిర్మాణానికి రూ.10.37 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- వీటిలో చల్లపేట పీహెచ్‌సీ భవన నిర్మాణం పూర్తి



నిర్మాణం పూర్తయిన చల్లపేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చింతన కోసం గుడికి... ఒంట్లో నలతగా ఉంటే ఆస్పత్రులకు వెళ్తాం. మానవ జీవనంలో రెండూ ప్రధానమే. ఆలయంలోని దేవుడు నమ్మకంతో కూడిన ధైర్యాన్నిస్తే... ఆస్పత్రిలోని వైద్యుడు ఆయుష్షును పోస్తాడు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే ఆస్పత్రులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆధునీకరిస్తోంది. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తూ పీహెచ్‌సీలను సుందరంగా తీర్చిదిద్దుతోంది. పూర్తిస్థాయి సిబ్బంది నియామకంతో పాటు ఆధునిక వైద్యపరికరాలు, వైద్యసేవలందించేందుకు అవసరమైన భవనాలను నిర్మిస్తోంది. ఆస్పత్రి పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతోంది. గతంలో పేరు కూడా కనిపించని స్థాయిలో ఉండే పీహెచ్‌సీలకు ఆధునిక సొబగులు అద్దుతోంది.

ఆధునికీకరణ పనులు ఇలా...

జిల్లాలో 48 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో 42 పీహెచ్‌సీలు ఆధునికరణకు, ఆరు పీహెచ్‌సీలకు కొత్త భవనాల నిర్మాణానికి నాడు-నేడు కింద ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. ఇప్పటికే 42 పీహెచ్‌సీల ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. దీనికోసం రూ. 16.04 కోట్లు ఖర్చుచేసింది. పీహెచ్‌సీల్లో మరుగుదొడ్ల మరమ్మత్తులు, ఆపరేషన్ థియేటర్ ఆధునికీకరణ, ఏసీ సౌకర్యం, ఆస్పత్రి అంతా పెయింటింగ్స్, పాడైన వాటి డోర్లు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, పాడైన టైల్స్ స్థానంలో కొత్త టైల్స్ వేయించడం వంటి పనులను నాడు-నేడు కింద చేపట్టింది.



ఆధునీకరించిన గంట్యాడ మండలం పెదమజ్జి పాలెం పీహెచ్‌సీ

రూ.10.37 కోట్లతో ఆరు పీహెచ్‌సీ భవనాల నిర్మాణం

జిల్లాలోని ఆరు పీహెచ్‌సీల భవనాలు పూర్తిగా పాడవ్వడంతో కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.10.37 కోట్లు మంజూరు చేసింది. వీటిలో రూ.1.73 కోట్ల ఖర్చుతో చల్లపేట పీహెచ్‌సీ భవన నిర్మాణం పూర్తయింది. మిగిలిన ఐదు పీహెచ్‌సీల భవనాలు నిర్మాణదశలో ఉన్నాయి. జామి పీహెచ్‌సీ భవనాలు రూ.1.84 కోట్లు, అలమండలో రూ.1.66 కోట్లు, కొత్తవలసలో రూ.1.79 కోట్లు, వియ్యంపేటలో రూ.1.69 కోట్లు, ఎల్.కోట పీహెచ్‌సీ భవనాలు రూ.1.65 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. పీహెచ్‌సీల్లో ప్రసవ సేవలకు ఆపరేషన్ థియేటర్, మాతాశిశు సంరక్షణకు ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేస్తున్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. నాడు-నేడు నిధులతో జిల్లాలోని 42 పీహెచ్‌సీల్లో ఆధునికీకరణ పనులు చేపట్టాం. వీటిలో ఒక పీహెచ్‌సీలో పనులు పూర్తయ్యాయి. ఆధునికీకరణ పనులు అత్యంత నాణ్యతతో చేపడుతున్నాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ